క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తుల స్వీకరణ

పలాస: ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. స్థలం ఉన్నా, లేకపోయినా గ్రామ సచివాలయం వద్దకు వెళ్లి పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తుకు ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకం, స్థలం పొజిషన్ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువపత్రం జత చేయాలన్నారు. ఈ ఏడాది మార్చి నాటికి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

అలరించిన గిరి నృత్యం



మందసలో గిరిజనుల ప్రదర్శన

కాశీబుగ్గ: సంక్రాంతి సంబరాలలో భాగంగా గిరిజనులు ఊరూరా తిరుగుతూ గిరిజన సంగీత వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ ఆకట్టుకుంటున్నారు. శుక్రవారం మందస పట్టణ వీధుల్లో గిరి నృత్యాలు చేస్తూ సందడి చేశారు.

క్రీడాకారుడికి సన్మానం



కృష్ణారావును సన్మానిస్తున్న దృశ్యం

పలాస: మండలంలోని రెంటికోట గ్రామానికి చెందిన క్రికెటర్ నర్తు కృష్ణారావుకు గ్రామస్తులు, సర్పంచ్ శాసనపురి తిరుమలరావు, మాజీ ఎంపీటీసీ హోరియా మోహనరావులు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి సన్మానాలు పొందేందుకు క్రీడాకారుల కఠోర శ్రమ దాగి ఉందన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నారాయణపురంలో శ్రమదానం



గోతులను పూడ్చుతున్న యువత

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దబొడ్డపాడు పంచాయతీ నారాయణపురంలో యువత శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. గ్రామానికి వెళ్లే రహదారిపై గుంతలను పూడ్చారు. పూండి–బెండిగేటు రహదారి నుంచి గ్రామం వరకు రహదారి అధ్వానంగా మారడంతో సంక్రాంతికి గ్రామానికి వచ్చిన యువత సుమారు 700 మీటర్లు మేర గ్రావెల్‌తో బాగు చేశారు. కార్యక్రమంలో యువకుల భాగ్యరాజు, శ్రీను, శ్రావన్. దిలీప్, సంజీవ్ పాల్గొన్నారు.

రైల్వే పనుల పరిశీలన



స్టేషన్‌లో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న రైల్వేసైట్ ఇంజనీర్

ఇచ్ఛాపురం: స్థానిక రైలు నిలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను రైల్వే ఇంజనీర్ సుర్జీత్‌మహంతి శుక్రవారం పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా స్థానిక రైలు నిలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, నార్త్ కేబిన్ నుంచి స్టేషన్ వరకు వేసిన తారురోడ్డు, చిల్డ్రన్స్ పార్కు పనులు, స్టేషన్ ప్రహరీ పనుల్లో నాణ్యతపై ఆరా తీశారు. ఫిబ్రవరి మొదటి వారంలో డీఆర్ఎం పర్యటన ఉన్నట్లు తెలిపారు. ఆయనతో పాటు జెడ్ఆర్‌యూసీసీ, రైల్వేయూజర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



నీటి స్టోరేజ్‌లో మద్యం సీసాలు

రూ. లక్షల వ్యయం
నిర్వహణలో నిర్లక్ష్యం

- టెక్కలిలో అపరిశుభ్రంగా సమగ్ర రక్షిత మంచినీటి పథకం
- పేరుకుపోయిన నాచు, మద్యం సీసాలు
- ఏటా లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నా ఫలితం శూన్యం

టెక్కలి :

డివిజన్ కేంద్రమైన టెక్కలిలో సమగ్ర రక్షిత మంచినీటి పథకంలో అపరిశుభ్రత తాండవిస్తోంది. నిత్యం ఇదే నీటిని వినియోగిస్తున్న ప్రజలు సురక్షిత నీరు అందక ఆందోళన చెందుతున్నారు. రక్షిత మంచినీటి పథకం నీటిని నిల్వ చేస్తున్న స్టోరేజ్ ప్రాంతంలో మద్యం సీసాలు, పూర్తిగా పేరుకుపోయిన నాచు, మరోవైపు రక్షణ కంచెలు లేకపోవడంతో



పథకం వద్ద తెగిపోయిన రక్షణ కంచెలు

పశువుల సంచారంతో రక్షిత మంచినీటి పథకం వద్ద పూర్తిగా పారిశుద్ధ్యం లోపించింది. సుమారు 26 గ్రామాలకు నిత్యం మంచినీటి సరఫరా అందజేస్తున్న మంచినీటి పథకం నిర్వహణ విషయంలో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిర్వహణ ఏటా లక్షలాది రూపాయలు వెచ్చిస్తూ ఆ బాధ్యతను ఓ ప్రైవేట్ వ్యక్తికి అప్పగించారు. అయినప్పటికీ ఇక్కడి పరిస్థితులు అపరిశుభ్రతంగా ఉండటంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తున్నాయి.

పథకం నిర్వహణ ఇలా...

సమగ్ర రక్షిత మంచినీటి పథకం ద్వారా టెక్కలి మేజర్ పంచాయతీతో పాటు చుట్టు పక్కల 26 గ్రామాల పరిధిలో సుమారు 47 వేల మందికి నిత్యం 20 లక్షల లీటర్ల పై చిలుకు మంచినీటిని సరఫరా చేస్తుంటారు. దీనికి సంబంధించి ఏటా జిల్లా పరిషత్ నిధుల నుంచి సుమారు 56 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నారు. కాంట్రాక్ట్ ద్వారా ఈ పథకం నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేట్ వ్యక్తికి అప్పగించారు. అయితే నిర్వహణ విషయంలో అటు కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తితో పాటు పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా గ్రామీణ రక్షిత మంచినీటి పథకం అధికారులు స్పందించి పథకం నిర్వహణపై దృష్టి సారించాలని పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యంతో ఆటలా?



టెక్కలితో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో పేద, సామాన్య ప్రజలు సమగ్ర రక్షిత మంచినీటి పథకం నుంచి ప్రతి రోజూ నీటినే తాగడానికి, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. అటువంటి పథకం ఎంతో పరిశుభ్రంగా ఉండాలి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– టి.లోకేశ్వరరావు, వార్డు సభ్యుడు, టెక్కలి మేజర్ పంచాయతీ

అధికారులు పర్యవేక్షించాలి



సమగ్ర రక్షిత మంచినీటి పథకం నిర్వహణ విషయంలో అధికార యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని రక్షిత మంచినీటి పథకం వద్ద కట్టుదిట్టమైన పరిశుభ్రతా చర్యలు చేపట్టాలి.

–ఎస్.షణ్ముఖరావు, ప్రజా సంఘాల నాయకుడు, టెక్కలి

ఆదేశాలు జారీ చేస్తాం...

సమగ్ర రక్షిత మంచినీటి పథకం నిర్వహణ విషయంలో ఎటువంటి అపరిశుభ్రత లేకుండా సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేస్తాం. అక్కడ ఉన్న సిబ్బందితో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– కె.రామకృష్ణ, డీఈ, గ్రామీణ నీటి సరఫరా విభాగం, టెక్కలి



టెక్కలిలోని సమగ్ర రక్షిత మంచినీటి పథకం నీటి స్టోరేజ్‌లో పేరుకుపోయిన నాచు, పిచ్చి మొక్కలు

ఉపాధ్యాయుడికి కలెక్టర్ అభినందనలు



కలెక్టర్‌కు పుస్తకాలు అందిస్తున్న హెచ్‌ఎం నాగేశ్వరరావు

కాశీబుగ్గ: పలాస మండలం లొద్దభద్ర ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గొర్లె నాగేశ్వరరావును కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండర్కర్ అభినందించారు. కవితా విపంచి, వెలుగునీడలు అనే పుస్తకాలను రచించి కలెక్టర్‌తో ఆవిష్కరించారు. సమాజానికి ఉపయోగపడే రచనలు చేయడం అభినందనీయమని కలెక్టర్ ప్రశంసించారు. స్వాతంత్ర సమరయోధులు, బంధాలు అనుబంధాలపై నాగేశ్వరరావు పుస్తకాలు రాశారు.

పేదలకు దుస్తుల వితరణ



దుస్తులు పంపిణీ చేస్తున్న ఢిల్లీరావు

కాశీబుగ్గ: సంక్రాంతి పండగ సందర్భంగా పలాస మండలం ఈదురాపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు గనియా ఢిల్లీశ్వరరావు శుక్రవారం నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. వజ్రపుకొత్తూరు మండలం బాతుపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఈయన ఏటా సంక్రాంతి సమయంలో నిరుపేదల ఇళ్లకు కుటుంబ సమేతంగా వెళ్లి దుస్తులు అందజేస్తున్నారు.

ఏపీఎం ప్రసాదరావుకు ప్రశంసలు



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏపీఎం గొడబ ప్రసాదరావు



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఏపీఎం సనపల ప్రసాదరావు

వజ్రపుకొత్తూరు రూరల్: మహిళల జీవనోపాధిని ప్రోత్సహించేందుకు మహిళ సంఘాలు తయారు చేసిన ఉత్పత్తులను సేకరించి సిక్కోలు డ్వాక్రా బజార్‌లో జోరుగా అమ్మకాలు జరిపి ఉత్తమ సేవలు అందించిన వెలుగు ఏపీఎం గొడబ ప్రసాదరావుకు సత్కారం చేశారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అభినందిస్తూ ప్రసాదరావుకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తోటి ఏపీఎంలు, సిబ్బంది అభినందించారు.

ఇచ్ఛాపురం రూరల్: సిక్కోలు డ్వాక్రా బజారులో ఇచ్ఛాపురం మండలం నుంచి మహిళలు స్వయంగా తయారుచేసిన ఉత్పత్తులను ప్రదర్శించిన నేపథ్యంలో సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాద్‌కు పీడీ కిరణ్‌కుమార్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

కేసుల రాజీల్లో మధ్యవర్తిత్వం కీలకం



అవగాహన కల్పిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత

టెక్కలి: వివిధ రకాల కేసుల్లో రాజీల విషయంలో మధ్య వర్తిత్వం కీలకమని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి బీఎంఆర్ ప్రసన్నలత పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో మధ్య వర్తిత్వంపై శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించే విషయంలో మధ్య వర్తిత్వం మంచి మార్గమని పేర్కొన్నారు. ఇరుపక్షాలతో సంప్రదింపులు జరిపి కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏపీపీ శాంతి సంతోషి, ఏజీపీ ఎస్.తిరుపతిరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసరావు, న్యాయవాదులు బి.నారాయణరావు, కె.మన్మథరావు, పి.వాసుదేవరావు, డి.నరసింహామూర్తి, వి.అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌కాంప్లెక్స్ బలోపేతమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ధనంజయ మజ్జి

కవిటి : మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో సరైన విద్యాబోధనే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్కూల్‌కాంప్లెక్స్ సముదాయ సమావేశాలు మరింత బలోపేతం కావాలని ఎంఈఓలు ధనంజయ మజ్జి, చిట్టిబాబు అన్నారు. మండలంలోని మాణిక్యపురం, ఆర్.బెలగాం స్కూల్ కాంప్లెక్స్ లలో నిర్వహిస్తున్న పేరెంట్స్‌కమిటీ చైర్మన్లు, కాంప్లెక్స్ చైర్మన్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఉన్న సహలాలపుట్టుగ కాంప్లెక్స్ నూతన నిబంధనల మేరకు లేకపోవడంతో దాన్ని తొలగిస్తున్నట్లు చెప్పారు. మిగిలిన కాంప్లెక్స్‌కు ఆయా పరిధిలో ఉండే పంచాయతీల్లోని పాఠశాలలను జోడిస్తూ ఆరు స్కూల్‌కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వం తాజా మార్గదర్శకాల మేరకు 117 జీవో సవరణలపై చర్చించినట్టు తెలిపారు. ఇందులో వెల్లడైన అంశాల్ని జిల్లా విద్యాశాఖకు నివేదిస్తామని చెప్పారు.

జాతీయ కాపు సంఘం ఉపాధ్యక్షుడిగా ఆనందరావు



యారడి ఆనందరావు

కంచిలి: జాతీయ కాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా కంచిలి మండలం గోకర్ణపురం పంచాయతీ సర్పంచ్ యారడి ఆనందరావును ఎంపిక చేశారు. ఈ మేరకు జాతీయ కాపు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కర్ణ మురళీకృష్ణనాయుడు ఉత్తర్వులు జారీచేసినట్లు ఆనందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాపు సంఘం తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహించి, జాతి అభివృద్ధికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జీడిపిక్క బొమ్మవద్ద శుక్రవారం హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ వీసీలతో హెల్మెట్ డెమోను చూపించారు. ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

కాశీబుగ్గ : పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో సంక్రాంతి పండగ సందర్భంగా ఏర్పడిన చెత్తను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గలో చెత్త సేకరణ, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం



టెక్కలి: కోటబొమ్మాళిలోని కొత్తమ్మ తల్లి దేవస్థానంలో నిత్యాన్నదానం కార్యక్రమానికి దాతలు శుక్రవారం రూ.2 లక్షల విరాళం అందజేశారు. శ్రీకాకుళంకు చెందిన జేవీఎస్ఆర్ పట్నాయక్, లక్ష్మీకుమారి దంపతుల కుమారుడు అభిరామ్ జన్మదినం సందర్భంగా ఈ విరాళాన్ని అందజేశారు. ఆలయ కార్య నిర్వాహణాధికారి వి.రాధాకృష్ణకు చెక్కును అందించారు. అనంతరం అమ్మవారి ఫొటోను దాతలకు అందజేశారు.

టోర్నమెంట్ ప్రారంభం



కంచిలి: క్రీడలతో స్నేహసంబంధాలు మెరుగవుతాయని ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. కంచిలిలో శుక్రవారం కంచమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మొదటి రోజు రెండు మ్యాచ్‌లు హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో ఎస్ఐ పి.పారినాయుడు, ఎంపీడీఓ వి.తిరుమలరావు, నాయకులు బంగారు కురయ్య, జగదీష్ పట్నాయక్, మద్దిల ఆనంద్, వైఎస్సార్ సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు, జనసేన నేత లింగుబారి క్రాంతి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



పలాస: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని రెంటికోట సర్పంచ్ శాసనపురి తిరుమలరావు చెప్పారు. పలాస మండలం రెంటికోటలో శుక్రవారం కొయిట క్రీడా మైదానంలో ఆర్.పి.ఎల్ సీజన్–5 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. శుక్రవారం సాయంత్రం హోరాహోరీగా ఫైనల్ మ్యాచ్ జరిగింది. ప్రవీణ్ జట్టుపై ఈశ్వర్ జట్టు గెలుపొంది ట్రోఫీని సొంతం చేసుకుంది. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోహనరావు, గుమ్మడి రమణమూర్తి, నర్తు కృష్ణారావు, హరియా మహేష్, ఆలేటి రాజు, నిరాకర, పి.జగ్గారావు, గుమ్మడి కాంతారావు, బొండాడ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి క్రయవిక్రయాలు నేరం



కాశీబుగ్గ: గంజాయిని అమ్ముతున్నా, తరలిస్తున్నా సమాచారం తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు అన్నారు. మందస మండలం హరిపురం బజారులో మూడురోడ్లు కూడలి వద్ద శుక్రవారం ప్రయాణికులకు అవగాహన కల్పించారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు క్రయవిక్రయాలు జరపడం నేరమన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మందస పోలీసు స్టేషన్ ఎస్ఐ కృష్ణప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



ఇచ్ఛాపురం: శ్రీ సురంగ రాజా క్రీడామైదానంలో సంక్రాంతి సందర్భంగా చిన్నారుల కోసం నిర్వహించిన నర్సింగరావు భానుమతి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా ముగిసింది. శుక్రవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో కిడ్స్‌స్టార్స్ జట్టుపై బ్లూ డైమండ్ జట్టు గెలుపొందింది. విజేతలకు జిల్లా క్రికెట్ సంఘం చీఫ్ కోచ్ సుదర్శన్ చేతుల మీదుగా ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో దాతలు బత్తుల వెంకటరమణ, చాట్ల తిరుపతి, స్నేహలత, రాజు, సోమేశ్, గణేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్



కాశీబుగ్గ :మున్సిపాలిటీలోని డిగ్రీ కళాశాల రోడ్డులో శుక్రవారం రాత్రి ట్రాఫిక్ స్తంభించింది. డాక్టర్ మల్లేశ్వరరావు ఆస్పత్రి ఎదురుగా ఓ ఆటోను హ్యాండిల్ లాక్‌చేసి వెళ్లిపోవడంతో అటువైపుగా రాకపోకలు జరిపే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఎట్టకేలకు స్థానికులు ఆటోను ముందుకు జరపడంతో సమస్య సద్దుమణిగింది.

ఎం.తోటూరు యువకుడి ఔదార్యం



పలాసలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ప్రసవ వేదనతో బాధపడుతున్న గర్భిణికి అత్యవసరంగా 'ఏ' పాజిటివ్ రక్తం అవసరం కావడంతో ఇచ్ఛాపురం మండలం ఎం.తోటూరుకు చెందిన పాతిర్ల గిరిబాబురెడ్డి స్పందించారు. సమాచారం అందుకున్న వెంటనే శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి రక్తదానం చేశారు. దీంతో వైద్యులు, బాధితురాలి కుటుంబ సభ్యులు గిరిబాబును అభినందించారు.

– ఇచ్ఛాపురం రూరల్

'ఆత్మీయ' సమ్మేళనం



నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

బోరుభద్ర గ్రామస్తుల ఔదార్యం



బోరుభద్ర గ్రామానికి చెందిన నిరుపేద యువకుడు కుమ్మరి రాము (34) అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామానికి చెందిన యువకులు, ఉద్యోగులు బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. శుక్రవారం రూ.లక్ష 5 వేల నగదును మృతుడి భార్య, అమ్మనాన్నలకు అందించారు. నాలుగేళ్ల కుమారుడికి శ్రీ వివేకానంద విద్యాలయంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని డైరెక్టర్ సూర్య ప్రకటించారు. రాబోయే రోజుల్లో కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు.

– సంతబొమ్మాళి